
సాక్షి సూర్యాపేట

శుక్రవారం ; 24 ; నవంబర్ ; 2023



సీల్ వేయలేదని ఆందోళన

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల తాళానికి సీల్ వేయలేదని తుడిమిడిలో గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. - IIలో



బీఆర్ఎస్‌ను సాగనంపాలి

ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. - IIలో



అవినీతి సర్కార్‌ను గద్దె దింపాలి

అవినీతి బీఆర్ఎస్ సర్కార్‌ను గద్దె దింపాలని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి అన్నారు. - IIలో

న్యూస్‌రీల్

నేడు సూర్యాపేట మార్కెట్‌కు సెలవు

భానుపురి (సూర్యాపేట): వర్షం వచ్చే అవకాశం ఉండడంతో పాటు మార్కెట్ యార్డ్‌కు అధిక మొత్తంలో ధాన్యం వచ్చినందున ఎగుమతుల దృష్ట్యా శుక్రవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎండీ ఫసియుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డుకు సరుకులను తీసుకొచ్చే రైతులు శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత మాత్రమే ధాన్యాన్ని అనుమతించబడుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సభ ఏర్పాట్ల పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న నాయకులు

తిరుమలగిరి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుమలగిరిలో శుక్రవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తెలిపారు. ఈ సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట– జనగామ ప్రధాన రహదారి పక్కన జరిగే సభకు 30 వేల మందికి పైగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి వెంకన్న యాదవ్ సభాస్థలిని పరిశీలించారు. ఆయన వెంట కర్ణాటక ఎమ్మెల్సీ, తుంగతుర్తి ఎన్నికల కమిటీ అబ్జర్వర్ నారాయణస్వామి, పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బాలలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పేరాల వీరేష్, ఎండీ.హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్: బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలత గెలుపును కాంక్షిస్తూ హుజూర్‌నగర్‌లో 25న నిర్వహించే బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ రవికుమార్, నాయకులు ఈవీ రమేష్, పత్తిపాటి విజయ్, కుందూరి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

చివ్వెంల(సూర్యాపేట): యువత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి అమరావతి అన్నారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో లా డే సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగంలో హక్కులతోపాటు, విధులు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాలని సూచించారు. యువత చెడు మార్గాల బారిన పడకుండా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నాయకులను నిలదీయాలి



మాట్లాడుతున్న పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు

సూర్యాపేటటౌన్: ఎన్నికల వేళ రాజకీయ పార్టీలన్నీ పోటీపడి హామీలు ప్రకటిస్తున్నాయని, ఏనాడు ప్రజా సమస్యలపై పట్టించుకోలేదని, ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను సమస్యలపై నిలదీయాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం గత పాలనలో చేసిన అవినీతి, అక్రమాలన్నింటినీ మరిచి నిజాయితీపరులుగా ఓట్ల కోసం ప్రజల దగ్గరికి రావడం సిగ్గు చేటన్నారు. ప్రజల సమస్యలు పట్టని రాజకీయ నాయకులు రకరకాల వాగ్దానాలు చేస్తూ ప్రచారం చేసి ప్రజలను మరోసారి మోసగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సంఘం నాయకులు అంజద్, అశోక్, కార్తీక్, ప్రశాంత్, మధు తదిరులు పాల్గొన్నారు.

అగ్రనేతల ఆగమనం

దద్దరిల్లుతున్న ఎన్నికల ప్రచారం

- నేడు నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరులో రేవంత్ సభలు
- రేపు హుజూర్‌నగర్‌కు జేపీ నడ్డా, మునుగోడుకు అమిత్‌షా
- 26న భువనగిరికి అమిత్‌షా, సీపీఎం నేత సీతారాం ఏచూరి
- 27న దేవరకొండ, మునుగోడు, భువనగిరిలో ప్రియాంక పర్యటన
- ముగిసిన కేసీఆర్ సభలు.. రోడ్ షోలు నిర్వహిస్తున్న కేటీఆర్

సభలు, సమావేశాలు.. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. వివిధ పార్టీల అభ్యర్థుల తరఫున అగ్రనేతలు రంగంలోకి దిగారు. ఈ నెల 28వ తేదీన సాయంత్రం ప్రచారం ముగియనుండడంతో ఈ ఐదు రోజులు ప్రచారం హోరెత్తనుంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కూడా అగ్ర నాయకత్వాన్ని రంగంలోకి దింపుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పర్యటించారు. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగించారు. తెలంగాణ వచ్చాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం కేసీఆర్ సభల్లో వివరించారు. ప్రజలు ఆలోచించాలని, మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వస్తే అభివృద్ధి ఆగిపోతుందని ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. స్థానికంగా ఎన్నికలను ప్రభావితం చేయగల అంశాలను ప్రస్తావించారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రోడ్‌షోలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల పాల్గొన్న ఆయన.. గురువారం హుజూర్‌నగర్, దేవరకొండ రోడ్ షోల్లో ప్రసంగించారు.

పార్టీ శ్రేణుల్లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. 26వ తేదీన మంత్రి హరీశ్‌రావు ఆలేరు నియోజకవర్గం బొమ్మలరామారం మండలంలో పాల్గొనేలా బీఆర్ఎస్ ఏర్పాట్లు చేస్తోంది.

జేపీ నడ్డా, అమిత్‌షా రాక

బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ఇప్పటికే కేంద్ర మంత్రులు రంగంలోకి దిగారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 25వ తేదీన హుజూర్‌నగర్ సభలో పాల్గొంటారు. ఇటీవలే నల్లగొండలో నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. 25వ తేదీన మునుగోడులో, 26న భువనగిరిలో నిర్వహించే సభలకు హాజరుకానున్నారు.

ప్రచారంలోకి కాంగ్రెస్ అగ్రనేతలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఇప్పటికే రంగంలోకి దిగారు. వచ్చే మూడు నాలుగు రోజుల్లోనూ విస్తృతంగా పర్యటించేలా కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేటలో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పర్యటించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం నల్లగొండ నియోజకవర్గ బహిరంగ సభలో పాల్గొన్నారు. గురువారం ఆలేరులో విజయశాంతి పాల్గొని ప్రసంగించారు. 24వ తేదీన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. 27వ తేదీన దేవరకొండ, మునుగోడు, భువనగిరిలో ప్రియాంక గాంధీ సభలు నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది.

మాయావతి, పవన్‌కళ్యాణ్, సీతారాం ఏచూరి

బీజేపీ, బీఎస్పీ, సీపీఎం అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల జాతీయ నేతలు రంగంలోకి దిగారు. ఈ నెల 22న సూర్యాపేట సభలో బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి పాల్గొని ప్రసంగించారు. గురువారం బీజేపీ అభ్యర్థుల తరఫున జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పర్యటించారు. 26వ తేదీన భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ రోడ్ షోలలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొననున్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : ఎన్నికల ప్రచారం సందర్భంగా బీఆర్ఎస్ పట్ల ప్రజలు చూపిస్తున్న ఆదరణ సూర్యాపేటలో గెలుపును ఖాయం చేసిందని మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్ మండలంలోని నెమ్మికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో అనుసరించాల్సిన విధి విధానాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాబోయే ఐదు రోజులే సూర్యాపేట భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. పల్లె, పట్టణ ప్రజలంతా బీఆర్ఎస్‌తోనే ఉన్నారని, ప్రజలు చూపిస్తున్న ఆదరణతో గెలుపు విషయంలో డోకా లేదన్నారు. సమష్టిగా పని చేసి భారీ మెజార్టీ సాధించాలని కార్యకర్తలకు సూచించారు. నాయకుల మధ్య ఐక్యతే పార్టీకి శ్రీరామరక్ష అని, గడప గడపకూ సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులతో మమేకం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గాండ్రింపులు తప్ప ఈ ప్రాంతాన్ని ఉద్ధరించింది ఏమీ లేదని ఆరోపించారు. ప్రజలు ఇచ్చే ఓటమితో టైగర్లకు శాశ్వత విముక్తి లభించబోతుందని తెలిపారు. అంతకుముందు ఆత్మకూరులో కాంగ్రెస్ పార్టీకి చెందిన చిలుముల గోపాల్ రెడ్డి, గుణగంటి మల్సూర్, ఏపూరి గ్రామానికి చెందిన పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

- హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

గరిడేపల్లి: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎంపీ, హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం, కట్టవారిగూడెం, మంగాపురం, కీతవారిగూడెంతో పాటు పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు పలుకుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీతవారిగూడెం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒక్కసారి ఎంపీగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన తాను నిరంతరం హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి పని చేశానని చెప్పారు. ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తొమ్మిదేళ్లుగా సీఎం దగ్గర నుంచి ఎమ్మెల్యేల వరకు దోపిడీ ప్రధాన మార్గంగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక, ల్యాండ్, మైన్స్, వైన్స్, గంజాయిలో బీఆర్ఎస్ ప్రభుత్వం అగ్రగామిగా నిలిచిందన్నారు. 50వేల మెజార్టీతో హుజూర్‌నగర్‌లో తాను, కోదాడలో పద్మావతి గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి రహిత పాలనే లక్ష్యంగా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల అభివృద్ధికి పనిచేస్తామన్నారు. రాహుల్ గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. కేసీఆర్ చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి, అల్లం ప్రభాకర్‌రెడ్డి, చక్రధర్‌రావు, పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్, కటికం రమేష్, ఆదర్ల శ్రీనివాస్‌రెడ్డి, గుండు రామాంజిగౌడ్, మూలగుండ్ల సీతారాంరెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, షేక్ చాంద్‌మియా, బాల్దూరి సందీప్, పాకాల పరమేష్, గుర్వయ్య, చింతకాయల సైదులు, బాణోతు రాములునాయక్, బాణోతు వెంకటేశ్వర్లు, కడప దేవదానం, మేకల ధనమ్మ, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం



హుజూర్‌నగర్‌రూరల్: లింగగిరి వద్ద తడిసిన ధాన్యం రాశులు

సాక్షినెట్‌వర్క్: సూర్యాపేట పట్టణంతో పాటు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో కోతకు వచ్చిన పొలాలు ఉండడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పలు కుడ్ల వద్ద లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. రామన్నగూడెం, కుంచమర్తి తదితర కేంద్రాల్లో ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. గరిడేపల్లి మండల వ్యాప్తంగా చిరుజల్లులు పడ్డాయి. అదేవిధంగా హుజూర్‌నగర్ మండలంలో కురిసిన వర్షానికి వరి పైరు నేలవారింది.

వాహనాలను తనిఖీ చేయాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే



రామాపురం క్రాస్‌రోడ్ చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

కోదాడరూరల్: ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర ఎన్నికల చెక్ పోస్టును తనిఖీ చేసి మాట్లాడారు. అదేవిధంగా పట్టణంలోని కిట్స్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రకాష్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ప్రజలు సహకరించాలి

అనంతగిరి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు మండల ప్రజలు సహకరించాలని ఎస్పీ రాహుల్ ఎగ్డే అన్నారు. గురువారం అనంతగిరి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా పోలీస్ బందోబస్తు నిర్వహణపై పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట కోదాడ డీఎస్పీ ప్రకాశ్, కోదాడ రూరల్ సీఐ, అనంతగిరి ఎస్ఐ అనిల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

సరిహద్దు వద్ద నిఘా కట్టుదిట్టం

మేళ్లచెరువు: ఎన్నికల బందోబస్తు ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా గురువారం ఎస్పీ రాహుల్ హెగ్డే మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. మండల సరిహద్దు మ్యాప్, ఎన్నికల రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి సరిహద్దు వెంట నిఘా ఉంచాలన్నారు. విధుల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, జీఎస్టీ, ఐటీ శాఖల సిబ్బందితో కలిసి 24 గంటలు విధులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది ఎస్పీకి వివరించారు. ఆయన వెంట కోదాడ డీఎస్పీ ప్రకాశ్, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సురేష్‌యాదవ్ ఉన్నారు.

తొలి రోజు 587 మంది

- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈ నెల 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు 80 సంవత్సరాల పై బడిన వృద్ధులు, వికలాంగులకు కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా మొదటి రోజు గురువారం నాలుగు నియోజకవర్గాల్లో 587 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో భాగంగా మొదటి రోజున సూర్యాపేట నియోజకవర్గంలో వృద్ధులు 136 మంది, వికలాంగులు 79 మంది, కోదాడలో వృద్ధులు 96 మంది, వికలాంగులు 17 మంది, హుజూర్‌నగర్‌లో వృద్ధులు 67 మంది, వికలాంగులు 41 మంది, తుంగతుర్తిలో 122 మంది వృద్ధులు, అలాగే 39 మంది వికలాంగులు జిల్లాలో మొత్తం వృద్ధులు 411 మంది అలాగే వికలాంగులు 176 మంది మొత్తం 587 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

ఎన్నికల విధుల్లో ఉన్న పీఓ, ఏపీఓ, ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి 26 వరకు గడువు పొడగించినట్లు కలెక్టర్ వెంకట్రావ్ గురువారం తెలిపారు. 23 నుంచి 25 వరకు అవకాశం ఇచ్చామని, ఉద్యోగుల అభ్యర్థన మేరకు ఒక్క రోజు పొడగించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది ఎన్నికల శిక్షణ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లను వినియోగించుకోవాలని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు, పోలీస్ సిబ్బంది సంబంధిత ఆర్ఓ కార్యాలయాల్లో శుక్రవారం నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉంటే వారికి ప్రత్యేకంగా ఆయా జిల్లాల నుంచి పోస్టల్ బ్యాలెట్ వస్తుందని పేర్కొన్నారు. వారికి ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్సే మీకు అండ

- కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి
- కాంగ్రెస్ హయాంలో ఎత్తిపోతల పథకాలు మూలనపడ్డాయి
- మేమొచ్చాక నిధులు కేటాయించి మరమ్మతు చేయించాం
- కొత్త లిఫ్టులు మంజూరు చేశాం.. పనులు కొనసాగుతున్నాయి
- ఫ్లోరోసిస్ నుంచి ప్రజలను కాపాడిన ఘనత మాదే..
- హుజూర్‌నగర్, దేవరకొండ రోడ్‌షోలలో మంత్రి కేటీఆర్



హుజూర్‌నగర్ రోడ్ షోలో అభివాదం చేస్తున్న కేటీఆర్, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి



దేవరకొండలో రోడ్ షోకు హాజరైన జనం



దేవరకొండ రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్

హుజూర్‌నగర్, దేవరకొండ : గతంతో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేశామని, ఇవి కొనసాగాలంటే ప్రజలు మరోమారు కారు గుర్తుకు ఓటేసి గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం హుజూర్‌నగర్‌లో అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, దేవరకొండలో అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ గెలుపును కోరుతూ నిర్వహించిన రోడ్ షోలలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నో లిఫ్టులు ఉన్నాయని వాటిని రిపేర్ చేయించలేదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చి సైదిరెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత రూ.1,770కోట్లతో ముక్త్యాల, జాన్ పహాడ్ లిఫ్టుల పనులు ప్రారంభమయ్యాయని, రూ.340 కోట్లతో ఎన్నెస్పీ కాల్వల సీసీ లైనింగ్ చేస్తున్నారని చెప్పారు. 'మా తమ్ముడు సైదిరెడ్డి ఎమ్మెల్యేగా ఫుల్‌టర్మ్ పనిచేయలేదు. ఉప ఎన్నికల్లో గెలిచిండు మీరు నాలుగేళ్ల అవకాశం ఇచ్చారు. అందులో రెండేళ్లు కరోనా వచ్చిన సంగతి అందరికీ తెలుసు' అని అన్నారు. 2004 నుంచి 2014 దాకా ఉత్తమ్ చేయలేని పని రెండేళ్లలో సైదిరెడ్డి చేశాడని చెప్పారు. హుజూర్‌నగర్‌కు ఆర్‌డీఓ కార్యాలయం, ఈఎస్ఐ హాస్పిటల్ మంజూరు చేసినట్లు తెలిపారు. మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో ఇండస్ట్రియల్ పార్కు కావాలని అడుగుతున్నారని అవన్నీ కావాలంటే సైదిరెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. వర్షంలోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో రావడం చూస్తుంటే.. సైదిరెడ్డి గెలిచి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లుగా ఉందని పేర్కొన్నారు.

కారు గెలుపును ఎవరూ ఆపలేరు

కారు గెలుపును ఎవరూ ఆపలేరని హుజూర్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వల్ల నియోజకవర్గాన్ని నాలుగేళ్లలో రూ.4వేల కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పారు. ఎప్పుడూ జనం మధ్య ఉండే సైదన్న కావాలా, చుట్టపుచూపుగా వచ్చిపోయే నాయకుడు కావాల్నో ప్రజలు ఆలోచించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని , వర్షం పడ్డా , పిడుగులు పడ్డా అవి ఆగవన్నారు. ఎన్నికల్లో రకరకాల గొడవలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రశాంతంగా ఉండి ఓటు వేయించాలని అన్నారు. రోడ్‌షోలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నాయకులు కాసోజు శంకరమ్మ, బాణోతు రమణా నాయక్, గట్టు శ్రీకాంత్‌రెడ్డి, జిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, ఎంపీపీలు పార్వతి, వెంకట్‌రెడ్డి, నాయకులు హరిబాబు, అమర్‌నాథ్ రెడ్డి, అమర్, నగేష్ రాథోడ్, కోట సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

దేవరకొండ అభివృద్ధి బాధ్యత నాదే

'అభ్యర్థి రవీంద్రకుమార్‌ను గెలిపిస్తే దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాది' అని మంత్రి కేటీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. దేవరకొండ మున్సిపాలిటీని రూ.100కోట్లతో అభివృద్ధి చేశామని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇక్కడి గిరిజనులు తమ బిడ్డలను అమ్ముకున్నారని, ఫ్లోరోసిస్ సమస్య పట్టిపీడించిందని, ఈ విషయంపై అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగేదన్నారు. ఒక్క చాన్స్ అంటూ కాంగ్రెస్ నాయకులువస్తున్నారని.. కాంగ్రెస్ హయాంలో ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారం అయ్యిందా, గాడిదలకు గడ్డి వేసి ఆవులకు పాలు పిండితే వస్తాయా అని ప్రశ్నించారు. ఢిల్లీ పెద్దలంతా ఒక్కటై సీఎం కేసీఆర్ గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ఢిల్లీ పార్టీ వారికి ఓట్లు వేస్తే మళ్లీ కనిపించరని, ఓట్లు పడగానే వారిని కలిసేందుకు ఢిల్లీ వరకు పోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కేసీఆర్ హయాంలో ఎంతో ప్రగతి

సీఎం కేసీఆర్ హయాంలో దేవరకొండ నియోజకవర్గం ఎంతో ప్రగతి సాధించిందని బీఆర్ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. ఇక్కడ అభివృద్ధి కావాలే తప్ప అరాచకం వద్దని అన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కేటీఆర్‌ను కోరారు. రోడ్‌షోలో గుత్తా అమిత్‌రెడ్డి, టీవీఎస్.రెడ్డి, నేనావత్ కిషన్ నాయక్, హనుమంతు వెంకటేశ్‌గౌడ్, వడ్త్య రమేశ్‌నాయక్, మారుపాకుల సురేష్‌గౌడ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, నక్క గిరిధర్, ముత్యాల సర్వయ్య, కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, సుభాష్‌గౌడ్, బీల్యానాయక్, శ్రీనివాస్‌గౌడ్, సుభాష్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల చిత్రాలు

• మీలో ఒక్కడిని



ఎన్నికల ప్రచారంలో నల్లగొండ పట్టణంలో జనం మధ్యలో ఉండి మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

• పతి విజయానికి సతి



హాలియా: పట్టణంలో ఓట్లు అభ్యర్థిస్తున్న సాగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భగత్ సతీమణి భవాని

• మామను గెలిపించాలని..



మిర్యాలగూడ: సీపీఎం అభ్యర్థి రంగారెడ్డిని గెలిపించాలని కోరుతున్న ఆయన కోడలు దివ్య

• బండ 'బరువు' తగ్గిస్తాం..



చిట్యాల: బీఆర్‌ఎస్ గెలిస్తే రూ.400కే సిలిండర్ అందజేస్తుందని ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేతలు

• చేతిలో చెయ్యేసి చెబుతున్నా..



రాజాపేట: మండలంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

ఓటరు స్లిప్పులు లేకున్నా ఓటేయొచ్చు

భువనగిరి: పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో ఓటరు స్లిప్పుల పంపిణీ కొనసాగుతోంది. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌ఓలు ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులు అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 70శాతానికి పైగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయినట్లు సమాచారం.

12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి..

ఓటరు స్లిప్పులు అందకపోయినా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండే బీఎల్‌ఓల నుంచి ఓటరు స్లిప్పులు తీసుకోవచ్చు. లేదంటే ఓటరు జాబితాలోని పేరు, క్రమ సంఖ్య, పోలింగ్ కేంద్రం వివరాలు చిన్న కాగితంపై రాసుకొని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తే ఓటు వేసేందుకు అనుమతిస్తారు.

ప్రచార రథం అడ్డగింత

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లి పరిధి చర్లగూడెంలో గురువారం భూనిర్వాసితుడు మెరుగు సత్తయ్య బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రచార రథాన్ని అడ్డుకున్నాడు. గత ఉప ఎన్నికలో మంత్రులు తమకు హామీ ఇస్తే బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేశామని, నేటికీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదని, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తున్నారని వెంకేపల్లి నుంచి చర్లగూడెం వచ్చిన ప్రచార రథాన్ని అడ్డుకొని తిరిగి వెంకేపల్లి వైపే పంపించాడు.



ప్రచార రథాన్ని అడ్డుకుంటున్న మెరుగు సత్తయ్య

తాళానికి సీల్ లేదని ఆందోళన

జంగ్ తెలంగాణ

• దివ్యాంగులు, వృద్ధుల బ్యాలెట్ ఓట్ల స్వీకరణపై అభ్యంతరం
• సుమారు రెండు గంటలపాటు నిలిచిపోయిన ఓటింగ్

శాలిగౌరారం: 80 సంవత్సరాలు పైబడిన వారితో పాటు అంగవైకల్యం కలిగిన వారివద్ద నుంచి ఓట్లను స్వీకరించేందుకు మండలానికి వచ్చిన ఎన్నికల అధికారులతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని తుడిమిడి గ్రామంలో రాజకీయ పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగారు. ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారివద్ద నుంచి ఓట్లను స్వీకరించేందుకు సంబంధిత ఎన్నికల అధికారులు గురువారం తుడిమిడి గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో సంబంధిత దరఖాస్తుదారులైన వారి నుంచి ఓట్లను స్వీరించేందుకు వెళ్లగా.. బ్యాలెట్‌బాక్స్‌కు ఉన్న తాళంకు సీల్ వేయకపోవడాన్ని అక్కడి నాయకులు గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. సీల్ వేయకపోవడం వల్ల ఓటింగ్ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకునే అవకాశం ఉందంటూ వారు సంబంధిత ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సుమారు రెండు గంటలపాటు ఓటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో సంబంధిత ఎన్నికల సిబ్బంది ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నేతలకు 'ఇంటి వద్దనే ఓటింగ్' విధానం గురించి వివరించారు. ఈ ఓటింగ్ ప్రక్రియ ఎన్నికల పరిశీలన అధికారి సమక్షంలో వీడియో, వెబ్‌కాస్టింగ్ రికార్డింగ్‌తో పూర్తి పారదర్శకంగా జరుగుతుందని వారికి వివరించారు. అనంతరం బ్యాలెట్‌బాక్స్ తాళానికి సీల్ చేయడంతో ఓట్ల స్వీకరణ కొనసాగింది.



తాళానికి సీల్ లేకుండా ఉన్న బ్యాలెట్ బాక్స్

అంధులు ఓటును వినియోగించుకునేలా అవగాహన

భువనగిరిటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియను పూర్తి చేశారు. అంతేకాకుండా అంధులు సులభంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బ్రెయిలీ లిపిలో ఒక పోస్టర్‌ను ముద్రించి అందజేయాలని బీఎల్ఓలకు ఎన్నికల అధికారులు ఆదేశించారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు అంధులకు ఈ కరపత్రాలు ఇచ్చి చదువుకోవాలని సూచించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు.



బ్రెయిలీ లిపిలో ముద్రించిన కరపత్రం

• గోవుల సంరక్షణే ఎజెండాగా..





మునుగోడు నియోజకవర్గం నుంచి యుగతులసి పార్టీ తరపున పోటీచేస్తున్న కొలిశెట్టి శివకుమార్ వినూత్న పద్ధతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. తన గుర్తు రోడ్డు రోలర్‌పై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తూనే.. గో రక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. ఆటోపై ప్రత్యేకంగా తయారు చేసిన కాడి ఎడ్లతో పాటు గోవు, లేగ దూడతో బొమ్మని సిద్ధం చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. – మునుగోడు

గంటలోనే మారిన పార్టీ కండువాలు



బీఆర్‌ఎస్‌లో చేరిన భీమయ్య



కాంగ్రెస్‌లో చేరుతున్న భీమయ్య

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు మన్నె భీమయ్య గంటలోపే రెండు పార్టీలు మారారు. భీమయ్య నివాసం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆయనకు బుధవారం రాత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గంటలోపే ఆయన ఇంటికి చేరి తిరిగి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ వారు తనను బలవంతంగా పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కారుపోతుల వెంకన్న ఉన్నారు.

జగదీష్‌రెడ్డి ప్రచారానికి విరాళం

సూర్యాపేట : బీఆర్‌ఎస్ అభ్యర్థి జగదీష్‌రెడ్డి ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం పలువురు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. గురువారం ఆత్మకూరు(ఎస్) మండలంలోని కోటపహాడ్‌కు చెందిన రైతు ముత్యాలు రూ.50 వేలు, రామోజీతండాకు చెందిన జత్యానాయక్ కొంత మొత్తం, సోమపొంగు వెంకన్న రూ.20 వేలు విరాళంగా అందజేశారు.



రైతులను అభినందిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

అవినీతి సర్కార్‌ను గద్దె దింపాలి

• కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి

తుర్కపల్లి: అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను గద్దె దింపాలని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మళ్లీ ఇప్పుడు ఎన్నికల ముందు కొత్త హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే ఈ రాష్ట్రంలో బాగుపడిందని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ కమీషన్లు నొక్కేస్తే, ఆయన కుమార్తె కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాంకు పాల్పడిందని ఆరోపించారు. మరోసారి కేసీఆర్‌కు అవకాశం ఇస్తే నిరుపేదల జీవితం మరింత దుర్భరంగా మారుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మహిళలకు పావలా వడ్డీకే రుణాలు, రైతులు, కౌలు రైతులకు రూ.15వేలు పెట్టుబడి సాయం, వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్, వ్యవసాయ కూలీకి ఏడాదికి రూ.12వేలు, విద్యార్థులకు రూ.5లక్షల భరోసా కార్డు, మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు రూ.2500 బ్యాంకు ఖాతాల్లో వేయడంతో పాటు ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తుందని తెలిపారు. ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్యకు భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కుసుమకుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, శంకర్‌నాయక్, భాస్కర్‌నాయక్, నర్సింహులు, ఎంపీటీసీ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయశాంతి, పక్కన ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య తదితరులు

కేసీఆర్ డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నాడు

• బీజేపీ న్యాయం, ధర్మాన్ని నమ్ముకుంది
• బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

యాదగిరిగుట్ట: ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నారని.. కానీ బీజేపీ న్యాయం, ధర్మాన్ని నమ్ముకుందని బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. భువనగిరి బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల కురుక్షేత్రంలో అంతిమ విజయం బీజేపీదేనన్నారు. కేసీఆర్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు మాత్రం బీజేపీ వైపే ఉన్నారన్నారు. కేసీఆర్ పంపించే డబ్బులు తీసుకొని బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్‌కు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ఉన్నంత కాలం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత లేదంటే కేసీఆర్ మనువడు సీఎం అవుతారు తప్ప.. ఇతర వ్యక్తులు సీఎం అయ్యే అవకాశం లేదన్నారు. అణగారిన వర్గాలకు బీజేపీతో రాజ్యాధికారం రాబోతుందన్నారు. తెలంగాణలో బీసీ వ్యక్తి సీఎం కావడానికి ప్రజలు సహకరించాలని కోరారు. అణగారిన వర్గాల పార్టీ అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీని కూడా ఎందుకు సీఎంని చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ రిజర్వేషన్లు కల్పించి, ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో కేంద్రం వాటా ఉందన్నారు. రాష్ట్రంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదని, చదువుకున్న యువకులకు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ గెలుపు కోసం పార్టీ నాయకులు, యువకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.



యాదగిరిగుట్ట కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన భువనగిరి బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్

వర్షంలోనే కార్నర్ మీటింగ్..

సాయంత్రం 6గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ కార్నర్ మీటింగ్ రాత్రి 9గంటలకు మొదలైంది. వర్షం పడటంతో వైకుంఠద్వారం వద్దకు వచ్చిన పార్టీ నాయకులు ఇబ్బంది పడ్డారు. వర్షంలోనే ఈటల రాజేందర్ ప్రసంగాన్ని విన్నారు. ఈటల రాజేందర్ ప్రసంగం ముగించుకొని వెళ్తున్న సమయంలో యువత సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. ఈ మీటింగ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి మల్లేశం, జిల్లా నాయకులు ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల్‌రెడ్డి, ఉట్కూరి అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాఘవుల నరేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మగాని రాజమణి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుంటిపల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ మంద శంకర్, పట్టణ అధ్యక్షులు భువనగిరి శ్యాంసుందర్, మండల అధ్యక్షులు క్లెం శ్రీనివాస్, బాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, ఎల్లేష్, ఆనంద్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బెలిదే అశోక్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షులు బోడ రాధ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి

• ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యూసుఫ్‌బాబు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. ఏవో కొన్ని పథకాలు ప్రవేశపెట్టి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే సబ్బండ వర్గాలకు మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం పక్కన పెట్టి తన కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువుల సంక్షేమంపై దృష్టి పెట్టారని ఆరోపించారు. సబ్సిడీలను ఎత్తివేసి రైతుల నడ్డి విరిచారని విమర్శించారు. 9 ఏళ్లయినా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదని, మళ్లీ ఇప్పుడు మూడోసారి అధికారం ఇస్తే మీ సమస్యలు తీరుస్తానని హామీలు గుప్పిస్తూ మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. ప్రజలు ఏకమై ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేయాలని, హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు చిలకమర్రి రాంరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

కత్తితో గొంతు కోసి భార్యను కడతేర్చిన భర్త

• మద్యం మత్తులో ఘాతుకం
• కుటుంబ వివాదాలే హత్యకు కారణం
• మాడుగులపల్లి మండలం ఆగామోత్కూర్‌లో దారుణం

మాడుగులపల్లి : నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. కుటుంబ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యను కిరాతకంగా కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అవిరెండ్ల నాగయ్య– రమణ(38)కి 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె పూజిత, కుమారుడు శివ కుమార్ సంతానం. కొంతకాలంగా దంపతులిద్దరూ నల్లగొండ మండలం జి.అన్నారం పరిధిలోని ఓ వ్యవసాయం క్షేత్రంలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. కొన్నేళ్లుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం భార్యతో గొడవపడిన నాగయ్య ఆమె చెయ్యి విరగొట్టాడు. దాంతో భార్య రమణ కుమార్తెతో కలిసి తిప్పర్తి మండలం ఎల్లారెడ్డిగూడెంలోని సోదరుడి ఇంటికి వెళ్లిపోయింది. పదిరోజుల క్రితం భార్యాభర్తలు పిల్లలతో కలిసి స్వగ్రామం ఆగామోత్కూర్‌కు వచ్చారు. ఈ క్రమంలో గురువారం మరోసారి భార్యాభర్తల నడుమ గొడవ జరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నాగయ్య కోపంలో భార్యపై కత్తితో దాడి చేసి గొంతుకోసి పరారయ్యాడు. ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని చూసి కుమార్తె స్థానికులకు విషయం చెప్పింది. ఆస్పత్రికి తరలించేలోగా అప్పటికే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.



భర్త నాగయ్యతో భార్య రమణ (ఫైల్)

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

కేతేపల్లి : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. కేతేపల్లికి చెందిన బయ్య వెంకన్న (50) మద్యానికి బానిసై ఈనెల 15న తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య ముత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.



వెంకన్న (ఫైల్)

మట్టపల్లిలో నిత్యారాధనలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కార్తీకమాసం రెండో గురువారం శాస్త్రోక్తం నిత్యారాధనలు నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణంతో పాటు క్షేత్రంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. కల్యాణంలో భాగంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, మూల విరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలు అలంకరించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, నారాయణాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొండమల్లేపల్లి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దఅడిశర్లపల్లి మండలం మాదాపురంతండాకు చెందిన రమావత్ రాంబాబు బైక్‌పై గురువారం దేవరకొండలో మంత్రి కేటీఆర్ రోడ్ షోలో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో కొండమల్లేపల్లి నుంచి బైక్‌పై మరో వ్యక్తి వరికోత మిషన్‌కు సంబంధించిన బ్లేడ్‌ను తీసుకొని వెళ్తున్నాడు. ఈ రెండు బైక్‌లు కొండమల్లేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వరికోత మిషన్‌కు సంబంధించిన బ్లేడు రాంబాబు మెడకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరబాబు పేర్కొన్నారు.